సాక్షి శ్రీకాకుళం

I

బుధవారం । 24 । జూలై । 2024

న్యూస్‌రీల్

‘పనులు ఆగడానికి వీల్లేదు’



స్టేడియం భవనంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం పనులను తక్షణమే ప్రారంభించాలని, భారీ వర్షాలు పడితే తప్ప పనులను ఆపడానికి వీల్లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులు, కాంట్రాక్టర్‌కు తేల్చిచెప్పారు. కోడి రామ్మూర్తి మైదానం నిర్మాణం పనులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి పనిపైనా నిశితంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ పనులపై తనకు అప్‌డేట్ ఇవ్వాలని డీఈఈ గణపతిరావును ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఉండే యువత, క్రీడాకారుల ఫిట్‌నెస్ కోసం అవసరమైన జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావుకు కలెక్టర్ ఆదేశించారు. అలాగే శ్రీకాకుళం–ఆమదాలవలస రోడ్డు నిర్మాణం పనులపై అధికారులతో చర్చించారు.

సీఎం గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేసిన స్వప్నప్రియ తల్లి

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార ఎస్బీఐ బంగారం మాయం కేసులో మాజీ రీజనల్ మేనేజర్ టీఆర్ఎం రాజు తన కుమార్తెను ఇరికించి ఆమె ఆత్మహత్యకు పాల్పడేలా చేశారని, తన కుమారుడిని జైలు పాలు చేశారంటూ ముఖ్యమంత్రి పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళ ఫిర్యాదు చేశారు. సీఎం గ్రీవెన్స్‌కై ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్ కమిటీలో సభ్యురాలిగా ఉన్న మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతిని విజయవాడలో కలిసి వినతిపత్రం అందించారు. ఆమెతో పాటు శిష్టకరణ సంఘ ప్రతినిధులు డబ్బీరు వాసు, ఆర్.వి.ఎస్.శర్మ, భాను తదితరులు ఉన్నారు.

స్వర్ణంతో మెరిసిన స్వరాజ్



బెంగళూరులో జరిగిన పోటీల్లో స్వరాజ్‌కు స్వర్ణ పతకం అందిస్తున్న నిర్వాహకులు

నందిగాం: మండలంలోని దేవుపురానికి చెందిన అంబటి స్వరాజ్ 13వ జాతీయ స్థాయి జూనియర్, సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీల్లో లాంగ్ జంప్ విభాగంలో స్వర్ణపతకం సాధించి సత్తా చాటాడు. దేవుపురానికి చెందిన అంబటి శ్యామలరావు, జ్యోతి దంపతుల పెద్ద కుమారుడైన స్వరాజ్ అంధుడు. అయితే చదువుతో పాటు ఆటల్లోనూ చురుగ్గా ఉంటాడు. రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి వెళ్లాడు. బెంగళూరు కంఠీరవ స్టేడియంలో జరిగిన పోటీల్లో జాతీయ స్థాయిలో స్వర్ణం గెలుచుకొని సత్తా చాటాడు. జాతీయ స్థాయిలో పతకం సాధించడంపై స్వరాజ్ తల్లిదండ్రులతో పాటు స్థానిక సర్పంచ్ యర్ర విశ్వశాంతి, మాజీ ఎంపీపీ యర్ర చక్రవర్తి, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తుఫాన్ నష్టం పెద్దగా లేదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అధికారుల అప్రమత్తతతో తుఫాన్ వల్ల పెద్దగా నష్టం జరగలేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాలో కంచిలి, కవిటి, మందస, ఎచ్చెర్ల తదితర మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో నాగావళి, వంశధార నదుల్లో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు ఐదు వేలు క్యూసెక్కుల వరకు వచ్చినట్లు ఆయన వివరించారు. నదుల వల్ల ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. కాలువల వద్ద లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వరి పంటపొలాలు సుమారు 150 ఎకరాల వరకు ముంపునకు గురయ్యాయని తెలిపారు. జిల్లాలో ఆరు ఇల్లు డ్యామేజ్ అయ్యాయని, రోడ్లు అక్కడక్కడా పాడైపోయాయని, ఎలక్ట్రికల్ పోల్స్‌కు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులను నష్టపోలేదన్నారు.

శుభ్రతపై దృష్టి పెట్టండి

ప్రతి మంగళ, శుక్రవారాల్లో జిల్లాలో యాంటీ లార్వా కార్యక్రమాలు చేయడం జరుగుతోందన్నారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, జీజీహెచ్ ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం ప్రతి ఇంటినీ శుభ్రపరచే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది, మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మలేరియా, డెంగీ వంటి వాటి పై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. భారీ వర్షాలు తగ్గినప్పటికి వర్షాలు కొనసాగుతున్నందున అందరూ నీరు వేడి తాగాలని ఆయన కోరారు.





బడ్జెట్‌లోనూ.. వెనుకబాటే..

సిక్కోలుకు మళ్లీ శూన్యం హస్తం

- ‘వెనుకబడిన సాయం’ ప్రకటన తప్ప కనిపించని న్యాయం
- జిల్లాకు ఒక్క సంస్థనైనా కేటాయించని వైనం
- సువర్ణావకాశం చేజార్చుకున్న చంద్రబాబు అండ్ కో

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాకు మళ్లీ ద్రోహం జరిగింది. అవకాశం ఉన్నప్పుడు ప్రయత్నించకుండా ఎన్డీఏ పాలకులు చేతులెత్తేశారు. కేంద్ర ప్రభుత్వంలో మన ఎంపీ కేంద్ర మంత్రి హోదాలో భాగస్వామిగా ఉన్నారు. కూటమి అధికారం పొందడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని చెబుతున్నారు. జిల్లాకు కీలక ప్రాజెక్టులు తీసుకురావడానికి ఇంత కంటే బంగారు అవకాశం ఇంకేముంటుంది. కానీ ఆ సువర్ణావకాశాన్ని జార విడుచుకున్నారు.

ఎప్పుడూ వినిపించే వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చే సాయం తప్ప.. ఈ సారి కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్‌లో జిల్లాకు ఏమీ సాధించలేకపోయారు. విభజన చట్టాన్ని అనుసరించి అయినా సరే ఒక జాతీయ ప్రాజెక్టును జిల్లాకు తీసుకురాలేకపోయారు. వాస్తవాలు ఇలా ఉన్నా కూటమి నేతలు మాత్రం ఆహో.. ఓహో అని ప్రశంసించడాన్ని చారిత్రక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు, మేధావులు భావిస్తున్నారు.

మరోసారి అన్యాయం

రాష్ట్ర విభజనలో ఎక్కువగా నష్టపోయింది మన జిల్లానే. విభజనచట్టంలో భాగంగా రాష్ట్రానికి వచ్చిన అనేక జాతీయ సంస్థలను మిగతా జిల్లాల్లో ఏర్పాటు చేశారే తప్ప మన జిల్లాను పట్టించుకోలేదు. 2014–19లో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉన్నా మనకు ఏమీ తీసుకురాలేదు. అనంతరం 2019లో బీజేపీకిసొంతంగా మెజారిటీ ఉండడంతో కేంద్రంపై ఒత్తిడి చేసే పరిస్థితి లేకపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చింది. ఈసారి ఇక్కడ ఎంపీలపైనే ఎన్డీఏ ప్రభుత్వం ఆధారపడి ఉంది. దీనికి తోడుగా శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్రమంత్రిగా ఉన్నారు. కానీ ఆయన కూడా స్థానిక ప్రజల ఆకాంక్ష నెరవేర్చలేకపోయారు. జిల్లాకు కనీసం ఒక్క జాతీయ సంస్థనైనా కేటాయించలేదు. కనీసం ఆ ప్రతిపాదన కూడా లేదు.

అవసరాలు ఎన్నో..

- ఉద్దానాన్ని దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధి పీడిస్తోంది. దీనినివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేసింది. పలాసలో ఏకంగా కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కట్టింది. ఈ సమస్యను విశాల దృక్పథంతో చూసి జాతీయస్థాయిలో పరిశోధనలు చేయిస్తే.. ఉద్దానం శోకం తీరుతుంది. కానీ కేంద్రం ఆ ప్రతిపాదన కూడా చేయలేదు.
- జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారు. కానీ జాతీయ విద్యా సంస్థలు అతి తక్కువ మాత్రమే ఉన్నాయి. సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించిన విశ్వవిద్యాలయం ఇక్కడ ఏర్పాటైతే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కానీ మన జిల్లావైపు వారు చూడనే లేదు. అదే విధంగా అపార పరిజ్ఞానం ఉన్న ఇక్కడ యువతకు శిక్షణ ఇచ్చేందుకు జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినా ప్రయోజనం కలిగేది.
- శ్రీకాకుళం వ్యవసాయాధారిత జిల్లా. నైరా వంటి పరిశోధనా స్థానం ఉన్నప్పటికీ దానికి జాతీయ స్థాయిలో ప్రోత్సాహం అందితే దేశానికి మరిన్ని కొత్త కొత్త వంగడాలు పరిచయం చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే గత వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల, హార్టికల్చరల్ రీసెర్చ్ సెంటర్, వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల వంటివి ఏర్పాటు చేశారు. దీనికి కేంద్రం తోడు కలిస్తే అద్భుతాలు జరుగుతాయి. కానీ మన నాయకులు అలాంటి ప్రతిపాదనేదీ కేంద్రం వద్ద చేసినట్టు లేరు.



- పలాస జీడిపప్పుకు దేశవ్యాప్తంగా ఖ్యాతి ఉంది. ఇక్కడ 400కు పైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. జీడి సాగు కూడా లక్ష ఎకరాల్లో ఉంది. జీడి రైతుకు తోడుగా జాతీయ స్థాయి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కనీసం జీడీ డెవలప్‌మెంట్ బోర్డు అయినా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కానీ అందులోనూ నిరాశే ఎదురైంది.
- జిల్లాలో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు 193కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. లక్షలాదిగా మత్స్యకారులు ఉన్నారు. మత్స్యకారుల కోసం జాతీయ ఫండింగ్‌తో కూడిన మారిటైమ్ యూనివర్సిటీ, లేదంటేదాని బ్రాంచిని ఏర్పాటు చేయాల్సి ఉంది. మత్స్యకార యువతకు ట్రైనింగ్ చేసేందుకు దోహదపడేలా ఫిష్ ఫార్మింగ్ కోర్సు అందించే వీలుంది. కానీ దాని గురించి కేంద్రానికి చెప్పే వారే కూటమిలో లేకపోయారు.
- అడవులు అధికంగా ఉన్న మన జిల్లాలో కేంద్రీయ ఔషధ మొక్కల పరిశోధన సంస్థ ఏర్పాటైతే కొత్త ఔషధాలను పరిచయం చేసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రాసెస్ట్ ఫుడ్ ఇండస్ట్రీస్‌ను ఏర్పాటుచేయాలని చాలా మంది కోరుతున్నారు. ఈ కోరికలేవీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లలేదు.
- శ్రీకాకుళం కేంద్రంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల కళాకారులకు ఉపయోగపడేలా జాతీయ స్థాయి ఫండింగ్‌తో ఫైన్ ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ లాంటివి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ మూడు సార్లు గెలిచిన ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రి పదవి దక్కించుకున్నంత శ్రద్ధగా జిల్లా అవసరాలను కేంద్రానికి చెప్పలేకపోయారు. రైళ్ల నిలుపుదల వంటివి చేసుకుంటూ కాలం గడుపుతున్నారన్న విమర్శలు మళ్లీ మూటగట్టుకుంటున్నారు.

రాష్ట్రానికి మొండి చేయి



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మొండి చేయి చూపారు. బీజేపీ స్నేహంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై, సీఎంగా పగ్గాలు చేపట్టిన చంద్రబాబు రాష్ట్రానికి అవసరమైన నిధుల కేటాయింపు విషయంలో విఫలమయ్యారు. కేవలం కాకి లెక్కలతో బడ్జెట్ అమలు చేసినట్లుగా కనిపిస్తోంది. – పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి

అంకెల గారడీ



రాజధాని ప్రాంతానికి రూ.15వేలు కోట్లు కేటాయించినట్లు అంకెల గారడి చేశారు. ప్రపంచ బ్యాంక్ ద్వారా నిధులు సమకూర్చడం అని చెప్పడం, లోన్ కాదని స్పష్టంగా చెప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. శ్రీకాకుళం జిల్లాకు బడ్జెట్‌లో చోటు లేకపోవడం దారుణం. కేవలం ఉత్తరాంధ్రకు గ్రాంట్ మంజూరు అన్నారు తప్పితే ఇంత ఇస్తామని స్పష్టంగా చెప్పలేదు. మరోసారి జిల్లా ప్రజలు మోసపోయినట్టే.

– ఎంపీ స్వరూప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగులకు నిరాశనే మిగిల్చింది



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉద్యోగులకు, ప్రధానంగా సీపీఎస్, ఎన్‌పీఎస్ ఉద్యోగులకు నిరాశను మిగిల్చింది. స్టాండర్డ్ ఇన్‌కమ్ టాక్స్‌ను పెంచుతారని, స్లాబ్‌ల వ్యత్యాసాన్ని ఎక్కువ చేస్తారని ఉద్యోగులు ఆశించారు. స్వల్పంగా మాత్రమే పెంచడంతో అసంతృప్త మిగిలింది. పాత పింఛన్ పునరుద్ధరణకు ఏ విధమైన నిర్ణయం తీసుకోకపోవడం విచారకరం.

– జి.భాస్కరరావు, అధ్యక్షులు, సీపీఎస్ ఉద్యోగులు సంఘం, శ్రీకాకుళం

ప్రజా ఆకాంక్షల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా ఆకాంక్షలను నెరవేర్చేదిగా ఉంది. వికసిత్ భారత్ ఏర్పాటుకు ఈ బడ్జెట్ ద్వారా ప్రధాని మోదీ బాటలు వేసినట్టు కనిపిస్తోంది. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా బడ్జెట్‌ను రూపుదిద్దారు. మహిళలు, యువత, రైతులకు బడ్జెట్‌లో అధిక కేటాయింపులు చేయడం సంతోషం. అమరావతి అభివృద్ధికి నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకోవడం హర్షణీయం.

– బిర్లంగి ఉమామహేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కీలక అంశాల్లో కేటాయింపులు లేవు



పోలవరం నిర్వాసితులకు రీహేబిలిటేషన్, రీ సెటిల్ మెంట్ కోసం రూ.32 వేల కోట్లు అవసరం. కానీ కేంద్ర బడ్జెట్‌లో ఈ కేటాయింపు లేదు. అమరావతి కోసం ప్రకటించిన రూ.15 వేల కోట్లు మల్టీ లేటరల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ద్వారా సమకూరుతాయని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ ఆర్థిక సాయంపై స్పష్టత లేదు. గ్రాంట్ అయితే నేరుగా చేరి ఉండేది.

– ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్, పూర్వపు వైస్‌చాన్స్‌లర్, బీఆర్‌ఏయూ.

హామీలు మేరకు కేటాయింపులేవీ..



ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం మేరకు ఇచ్చిన హామీలకు కేటాయింపులు లేవు. విభజన నుంచి ఇప్పటి వరకు ప్రతి బడ్జెట్ లోనూ నిరాశే ఎదురవుతోంది. రాజధాని నిర్మాణం కోసం రూ. 15 వేల కోట్లు నేరుగా గ్రాంట్ చేస్తే సరిపోయేది. కొత్త ప్రభుత్వ ఉద్యోగులకు తొలి జీతం అందజేయటం, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు వంటివి కొంత మెరుగ్గా ఉన్నాయి. – డాక్టర్ సీహెచ్ రాజశేఖర్‌రావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్.

కూటమిది ప్రచార ఆర్భాటమే



కేంద్ర బడ్జెట్ విషయంలో టీడీపీ కూటమిది ప్రచార ఆర్భాటమే. ఎన్డీఏ కీలక భాగస్వామిగా ఉన్నా బీహార్‌కు కేటాయించిన నిధులు కూడా మనకు ప్రకటించకపోవడం దారుణం. ఎన్నికల హామీల్లోనే రూ.15 వేల కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. ఇప్పుడు బడ్జెట్‌లో అమరావతికి అవే నిధులు ప్రకటించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు చేసే ప్రయత్నమే తప్ప మరేమీ కనిపించడం లేదు.

– ఎం.చిరంజీవులనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, తంప గ్రామం, హిరమండలం

బీహార్ కంటే తక్కువే..



అమరావతికి రూ.లక్ష కోట్లు అవసరం అని మంత్రి నారాయణ చెప్పారు. ఇప్పుడు కేంద్రం వివిధ ప్రభుత్వ సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లు అందిస్తామని ప్రకటించింది. దాన్ని చంద్రబాబు గొప్పగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఎన్డీఏలో మరో భాగస్వామి అయిన బీహార్ సీఎం నితీష్ కుమార్ ఆ రాష్ట్రానికి భారీగా నిధులు సాధించారు. కానీ చంద్రబాబు సాధించలేకపోయారు.

– అల్లు కృష్ణారావు, దుర్గలాపురం, హిరమండలం

వేట బాధ్యత చేపట్టాల్సిందే



ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. బాహుదా నది నీరు కలవడంతో వాగులు మరింత ఉధృతంగా పారుతున్నాయి. మంగళవారం ఇన్నేశుపేట సమీపంలో పారుతున్న ధర్మపురం గెడ్డలో పెద్దపెద్ద చేపలు రావడంతో స్థానిక యువకులు వలలు, గేలాలు పట్టుకుంటూ చేపల వేటను కొనసాగించారు. – ఇచ్ఛాపురం రూరల్

ఉప్పొంగిన ఉప్పుటేరు

ఐదు రోజులుగా పడుతున్న వానలకు ఉప్పుటేరు ఉప్పొంగింది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు కొండలపై పడిన వర్షం నీరు బెండి గెడ్డకు చేరడంతో బెండి గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తూ ఉప్పుటేరులోకి చేరడంతో నువ్వలరేవులోకి నీరు వచ్చేసింది. అలాగే కాలువలు, నారు మడులు, యదపాలాల్లో వరదనీరు చేరడంతో వజ్రపుకొత్తూరు, నగరంపల్లి కాశీనగరం వద్ద సుమారు 100 ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. –వజ్రపుకొత్తూరు రూరల్



ప్రత్యేక బీఎడ్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక బీఎడ్ మెంటల్లీ రిటార్డ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు 29వ తేదీ వరకు జరగనున్నాయి. 33 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పరీక్షలు పర్యవేక్షించారు.

270 ఎకరాల్లో పంట మునక

వంశధార నదిలో వరద నీరు పెరగడంతో సుమారు 270 ఎకరాల్లో వరి పంట ముంపు బారిన పడింది. వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానెల్ నిండా నీరు ప్రవహించి పొలాలపై ప్రవహిస్తోంది. దీని వల్ల తురకపేట, వ్యాసులపేట, సింధువాడ, వీరమల్లిపేట, బుడ్డివలస, వీరభద్రాపురం గ్రామాల పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి. కాలువల నిండా గుర్రపుడెక్క చేరడం వల్ల గండ్లు పడే ప్రమాదం ఉందని రైతులంటున్నారు. – సరుబుజ్జిలి



బుడ్డివలస వద్ద వరద నీటిలో పంటపొలాలు

మా నాన్నను బతికించండి

- నోటి కేన్సర్‌తో బాధ పడుతున్న తండ్రి
- చికిత్స సాయం చేయాలని బిడ్డల వేడుకోలు



తల్లీపిల్లలు ప్రతి ఇంటికీ వెళ్లి సాయం అర్థిస్తున్నారు. దాతలు స్పందించి తమ తండ్రి వైద్యానికి ఆర్థిక సాయం అందించాలంటూ ఆ పిల్లలు కోరుతున్నారు.

సాయం చేయాలనుకునేవారు **96508 83071** నంబర్‌ను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

చిన్నప్పుడు ప్రమాదం జరిగి కుడి చెయ్యి పోయింది. కాస్త పెద్దయ్యాక తోడుగా ఉన్న తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. ఒంటరిగానే బతుకీడుస్తూ ఎక్కడికో ఢిల్లీ వరకు వెళ్లి కుక్‌గా ఉద్యోగం సంపాదించాడు. జీవితం కాస్త కుదుటపడిందని అనుకుంటూ అక్కడే పెళ్లి కూడా చేసుకున్నాడు. వారికి ఇద్దరు మగ పిల్లలు సంతానం పుట్టారు. హమ్మయ్య దేవుడు కరుణించా డు.. అనుకుంటున్న దశలో కేన్సర్ మహ మ్మారి ఆ వ్యక్తిపై దాడి చేసింది. అప్పు చేసి మరీ దానికి చికిత్స చేయిస్తుంటే మెదడులో రక్తం గడ్డ కట్టేసింది. ఆ రెండింటికీ చికిత్స చేయించడానికి ఆ చిన్న కుటుంబం అపసోపాలు పడుతోంది. దాతలు దయ తలిస్తేనే ఆ వ్యక్తి బతికే పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే..

–ఇచ్ఛాపురం రూరల్

ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి హరిజనవాడకు చెందిన 45 ఏళ్ల రోహిణీ కుమార్ నోటి కేన్సర్‌తో బాధ పడుతున్నాడు. చిన్నతనంలో అనుకోని ప్రమాదంలో కుడి చేతిని పోగొట్టుకొని దివ్యాంగుడయ్యాడు. దురదృష్టం వెంటాడటంతో యుక్త వయస్సు రాగానే తల్లిదండ్రులను కోల్పోయాడు. ఆ తర్వాత ఢిల్లీ ఆంధ్రా భవన్‌లో కుక్‌గా పనిచేస్తూ గులాబీ అనే అమ్మాయిని పెళ్లి చేసుకొని ఒక ఇంటి వాడయ్యాడు. ఇప్పుడు ఆయనకు వినయ్, తేజా అనే ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. నాలుగు నెలల కిందట పిప్పి పన్ను బాధిస్తుందంటూ ఢిల్లీలో ఆస్పత్రిలో చూపిస్తే.. నోటి కేన్సర్ అంటూ వైద్యులు బాంబు పేల్చారు. దీంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. అసలే పేదరికంతో బాధపడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న దశలో కేన్సర్ భూతం పంజా విసరడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇప్పటికే ఇంటి పెద్ద దిక్కును రక్షించుకునేందుకు భార్య కష్టపడుతోంది. ప్రస్తుతం ఆయన విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ చికిత్సలో ఉండగానే ఆయన మెదడులో రక్తం గడ్డ కట్టింది. కేన్సర్ వైద్యంతో పాటు గడ్డకట్టిన రక్తం కరిగించే వైద్యానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. ఒంటరిగా ఆ ఇల్లాలు అంత డబ్బు సమకూర్చలేకపోతోంది.

క్లుప్తంగా

శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నేరం


మాట్లాడుతున్న న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఆడ పిల్లలు పుడతారని తెలిసి భ్రూణ హత్యలకు పాల్పడడం నేరమన్నారు. ఆడ పిల్లల సంఖ్య తగ్గితే సమాజంతో తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై, స్కానింగ్ సెంటర్స్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇందిరా ప్రసాద్, డాక్టర్ సౌమ్య శ్రీ, ఎంపీహెచ్ఈఓ జగన్నాథరావు పాల్గొన్నారు.

ఇళ్లకు ప్రత్యేక అతిథులు


తర్లాకోటలో ఓ ఇంటిలోకి వచ్చిన పక్షి


కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోట గ్రామంలో ఇళ్లలోకి వివిధ రకాల పక్షులు, పక్షి పిల్లలు వచ్చి చేరుతున్నాయి. గత వారం రోజులుగా తీవ్రమైన వర్షాలతో పాటు చలిగాలులకు చెట్లపై ఉండలేని పరిస్థితుల్లో ఇలా ఇంటి ఆవరణలకు వచ్చి చేరుతున్నాయి.

రాయితీపై ఉద్యానపంటల ప్రాసెసింగ్ యూనిట్లు


కవిటికొత్తూరు జీడీ సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం నారాయణరావు

కవిటి: కవిటి ఉద్దానం ప్రాంతంలో విస్తారంగా సాగులో ఉన్న కొబ్బరి అంతరపంటలైన జీడి మామిడి పనస పంటల ఉప ఉత్పత్తుల తయారీకి సంబంధించి 35 శాతం రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు పొందే అవకాశం ఉందని లైవ్లీహుడ్స్ డీపీఎం నారాయణరావు అన్నారు. మండల కొబ్బరి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య బోర్డ్‌ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ అధ్యక్షతన కవిటి కొత్తూరులోని కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 100కు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉన్నాయని సభ్యులు తెలిపారు. ఈ సంఖ్యను మరింత పెంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

'భూసార పరీక్ష ఫలితం' పత్రాల అందజేత


కర్తలిపాలెంలో పచ్చిరొట్ట ఎరువు పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నర్సింహమూర్తి

సోంపేట: రైతులు భూసార ఫలితాల సిఫారసు మేరకే ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి సూచించారు. మండలంలోని కర్తలిపాలేం గ్రామంలో 45 మంది రైతులకు భూసార పరీక్ష ఫలితాల పత్రాలను మంగళవారం అందజేశారు. అనంతరం గ్రామంలో సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూసార ఫలితాల సిఫారసు మేరకే ఎరువులు వినియోగించాలని సూచించారు. పచ్చిరొట్ట ఎకరానికి మూడు టన్నుల వరకు సేంద్రీయ ఎరువు అందజేస్తుందన్నారు. దీనిలో 6 కిలోల నత్రజని, 37 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ ఉంటాయని, రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు ఉషా కుమారి, పలువురు రైతులు పాల్గొన్నారు.

చర్మ స్పర్శపై అవగాహన

వజ్రపుకొత్తూరు రూరల్: చర్మంపై ఏర్పడే మచ్చలు, స్పర్శపై ప్రతి ఒక్కరూ తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ చక్రధర్ అన్నారు. మండలంలో గల సీతాపురం, పెద్దబొడ్డపాడు గ్రామాల్లో మంగళవారం ఇంటింటి సర్వే చేపట్టారు. చర్మ స్పర్శ లేకపోవడంతో పాటు దురదలతో బాధపడుతున్న వ్యక్తులు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఇంతింటా ఆదాయం

చీపుర్లు కడుతున్న మహిళలు


- కొండ చీపుర్ల తయారీతో ఆర్థిక స్వావలంబన
- ఆదర్శంగా సీతానగరం మహిళలు
- ప్రోత్సహిస్తే మరింత వృద్ధి


మహిళలు కట్టిన చీపుర్లు

సంతబొమ్మాళి: వివాహం సమయంలో ఇచ్చే సారెలో పుట్టింటి వారు చీపురు ఇవ్వకూడదంటారు.. ఇప్పుడు అదే చీపురు అత్తింటిలో ఇల్లాళ్లకు ఉపాధినిస్తోంది. మండలంలోని సీతానగరం మహిళలు కొండ చీపుర్ల తయారీతో ఆదాయాన్ని ఆర్జిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన బత్సల ధనలక్ష్మి దగ్గర కొండ చీపుర్లు తయారీని నేర్చుకున్న ఆ మహిళలు సొంత ఇంటిలోనే వీటిని తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకొని స్వశక్తిపై జీవిస్తూ తోటి మహిళలకు స్ఫూర్తినిస్తున్నారు.

ఒకరితో మొదలై.. ఊరంతా

సీతానగరం గ్రామానికి చెందిన బత్సల ధనలక్ష్మి పన్నెండేళ్ల కిందట బతుకు తెరువు కోసం అండమాన్ వలస వెళ్లారు. అక్కడ ఉపాధి కోసం పలు ప్రాంతాల్లో తిరిగి ఒక కుటీర పరిశ్రమలో మూడు నెలల పాటు చీపుర్ల తయారీ నేర్చుకున్నారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వచ్చి చీపుర్లతోనే జీవనాధారం పొందాలనుకున్నారు. తన భర్త సోమేశ్వరరావు ప్రోత్సాహంతో సొంత గ్రామంలోనే దీన్ని చిన్న కుటీర పరిశ్రమగా ప్రారంభించారు. మొదట్లో కాస్త పెట్టుబడి పెట్టి శ్రీముఖలింగం, మెళియాపుట్టి ప్రాంతాల నుంచి వీటికి కావాల్సిన కుంచె, నార, తాడును తెచ్చి చీపుర్లు కట్టేవారు. అది చూసిన చుట్టుపక్కల మహిళలు ఆసక్తితో ఆమె ఇంటికి వెళ్లి ఆమెతో పాటు పనిచేస్తూ చీపుర్లు కట్టడం నేర్చుకున్నారు. అతి కొద్ది కాలంలోనే ఆ చీపుర్లకు మంచి గిరాకీ లభించడంతో ఈ కుటీర పరిశ్రమ ఎంతో మందికి జీవనాధారంగా మారింది. స్వయం సహాయక సంఘాల రుణాలు స్త్రీ నిధి రుణాలతో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన దిశగా పలువురు మగువలు అడుగులు వేస్తున్నారు.

గ్రామంలో 280 కుటుంబాలు ఉండగా ప్రస్తుతం 70కు పైగా కుటుంబాల మహిళలు చేతి వృత్తిలా నిత్యం పని చేస్తుంటారు. ఒక చీపురు ధర రూ. 100 నుంచి రూ. 130వరకు పలుకుతుంది. రోజుకు 20 నుంచి 30 చీపుర్లు సులువుగా కట్టి ఖర్చులు పోను రూ. 700పై బడి సంపాదిస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 100 మందికి పైగా చీపుర్లు తయారు చేస్తున్న మహిళలు ఉన్నారు. వీరు తయారు చేసిన చీపుర్లు నాణ్యంగా ఉండడంతో బయట మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. వీటిని మన జిల్లాతో పాటు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేసి అమ్ముతుంటారు.

సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యం పెట్టుబడి పెట్టాల్సిన పరిశ్రమ కాబట్టి బయట నుంచి అప్పులు తెస్తే ఆర్థిక భారం అవుతుంది. అందుకే వీరికి ప్రభుత్వం సాయం చేస్తే మరింత వృద్ధి సాధ్యమవుతుంది. డ్వాక్రా సంఘాల ద్వారా తయారైన ఉత్పత్తులకు ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.

ఆసక్తి ఉంటే నేర్పిస్తాను..


అండమాన్‌లో ఒక కుటీర పరిశ్రమలో చీపుర్లు కట్టడం నేర్చుకున్నాను. మా గ్రామంలో 100 మంది వరకు నేర్పించాను. ఇంటి వద్దనే ఉంటూ రోజు వారి ఆదాయం సంపాదించుకుంటున్నాను. ఆసక్తిగా ఉన్న మహిళలను ప్రోత్సహించి నేర్పిస్తున్నాను. ఇంకా ఎవరికైనా ఆసక్తి ఉంటే చీపురు కట్టడం నేర్పిస్తాను. అవసరమైన ముడి సరుకుల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో పెట్టుబడి గతం కంటే ఎక్కువైంది. రుణాలిచ్చి ప్రోత్సహించాలి. – బచ్చల ధనలక్ష్మి, చీపురు తయారీదారులు, సీతానగరం

తక్షణ రుణ మంజూరు


సీతానగరంలో చీపుర్లు కడుతున్న మహిళలకు పొదుపు సంఘాలు, స్త్రీ నిధి ద్వారా తక్షణ రుణాలిచ్చి ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అర్హులైన మహిళలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి. గతంలో రెండు పర్యాయాలు శ్రీకాకుళంలో జరిగిన డ్వాక్రా బజారుకు మండలం నుంచి మహిళలు వెళ్లి చీపుర్లు విక్రయించారు. – సూర్యనారాయణ, వెలుగు ఏపీఎం, సంతబొమ్మాళి

వీర జవాన్‌కు ఘనంగా నివాళులు


దండుగోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: ఇటీవల కశ్మీరులో ఉగ్రవాదులతో పోరాడుతూ వీరమరణం పొందిన డొక్కరి రాజేష్‌కు దండుగోపాలపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు నివాళులర్పించారు. రాజేష్ ఇదే పాఠశాలలో చదువుకున్నాడు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పుష్పాంజలి ఘటించారు. రాజేష్ చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి అతని ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై దృష్టి: ఎస్పీ


సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి రోజూ పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి గంజాయి, నాటుసారా, మద్యం అక్రమ రవాణా అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జనాభా, భూనైసర్గిక స్వరూపం, సరిహద్దు ప్రాంతాలు, జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం, శాంతి భద్రతల సమస్యలు, నేరాల నమోదు, నేర ప్రవృత్తి, తీరు, సమస్యాత్మక గ్రామాలు, ట్రబుల్ మ్యాంగర్స్, స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని, అర్జీదారులు ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించిన వెంటనే వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు నేరం జరిగే ప్రదేశానికి వెళ్లి సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. నిత్యం నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా అరికట్టాలని, తరచూ గస్తీలు నిర్వహించాలన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని, సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు శృతి, బాలచంద్రారెడ్డి, నాగేశ్వరరెడ్డి, త్రినాథరావు, శ్రీనివాసరావు, ఏఓ గోపినాథ్, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పలాస సీహెచ్‌సీలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి

కాశీబుగ్గ: సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జ్వరాలకు, డయేరియా కేసులకు సంబంధించి పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె మంగళవారం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని సందర్శించి ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తమ్మినాన పాపినాయుడును ఆదేశించారు. ఆస్పత్రిలో ఉన్న అన్ని వ్యాధులకు అందుతున్న చికిత్సలను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యుల మధ్య సమన్వయం ఉండాలని, సీజనల్ వ్యాధులతో అనేక మంది వస్తారని వారికి సిబ్బంది, వైద్యులు వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రిలో మత్తు వైద్యుడు లేరని ఆమె దృష్టికి తీసుకెళ్లగా రోజుల వ్యవధిలో నియమించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

టెక్కలిలో..

టెక్కలి రూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిని మంగళవారం డీసీహెచ్ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులకు, పాముకాటులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నదానిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావుని అడిగి తెలుసుకున్నారు. అలాగే రోగులకు వైద్యం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ మహరాజ్, వైద్యులు లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

లంపీ స్కిన్ టీకాలు సద్వినియోగం చేసుకోవాలి


కంట్రగడ గ్రామంలో పశువులకు లంపీ స్కిన్ నిరోధక వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యాధికారులు

టెక్కలి: పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అందజేస్తున్న వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థక శాఖ ఏడీ జి.రఘునాథరావు సూచించారు. మంగళవారం టెక్కలి మండలం కంట్రగడ గ్రామంలో పశువుకు లంపీ స్కిన్ నిరోధక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్న సమయంలో నిరోధక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్వహించామని తెలిపారు. ప్రస్తుతం ఆగస్టు 18 వరకు పట్టణ, గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏడీ రఘునాథరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి జనకచక్రవర్తి, ఎల్ఎస్ఏ రమణ, ఏహెచ్ఏ కొండల రావు, పాడి రైతులు లోకేశ్వరరావు, అడవిరాజు, దేవకీనందన్, జగన్నాథం, కామేశ్వరరావు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువత స్పందించారు


ముక్తాపురం పాఠశాల రహదారిని బాగు చేస్తున్న యువకులు

మెళియాపుట్టి:

మండలంలోని ముక్తాపురం గ్రామంలోని గుడి, బడికి వెళ్లే రహదారి నీటి నిల్వ, చెత్తతో నిండి విద్యార్థులు, గ్రామ ప్రజలు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. దీనిపై సాక్షిలో మంగళవారం 'వాననీటి నిల్వతో ఇబ్బంది' శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రామానికి చెందిన యువత స్పందించారు. శ్రమదానం చేసి మంగళవారం పాఠశాలకు వెళ్లే రహదారిలో నిల్వ ఉన్న నీటిని, చెత్తను తొలగించారు. దీంతో విద్యార్థులకు రహదారి సమస్య పరిష్కారమైంది.

'క్వారీల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలి'

టెక్కలి: జిల్లాలో గ్రానైట్ క్వారీల నిర్వహణ, పర్మిట్‌ల మంజూరుకు అనుమతులు ఇవ్వాలని ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాడ గణపతి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా క్వారీ నిర్వహణ, పర్మిట్‌లకు అనుమతుల విషయంలో ఆంక్షలు విధించడంతో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా క్వారీల నిర్వహణ నిలిచిపోయిందన్నారు. దీని వల్ల గ్రానైట్ క్వారీలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది మంది కార్మికులు, వందలాది మంది వివిధ విభాగాల టెక్నీషియన్స్ రోడ్డున పడే దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 50 రోజులుగా ఇదే పరిస్థితి చోటు చేసుకుందని పేర్కొన్నారు.

జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి క్వారీల నిర్వహణ అనుమతులతో పాటు పర్మిట్‌లు మంజూరు చేసే విధంగా చూడాలని గణపతి డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికుల తరఫున పోరాటం చేస్తామని వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


లంక చంద్రశేఖర్ (ఫైల్)

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధి సమీప జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లంక చంద్రశేఖర్, కొల్లి ఝాన్సీ అనే ఇద్దరికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. అయితే గాయపడిన వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లంక చంద్రశేఖర్(24) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడికి బూర్జ మండలం పాలవలస.

పాలవలస గ్రామంలో విషాద చాయలు

బూర్జ: టెక్కలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలవలస గ్రామానికి చెందిన లంక చంద్రశేఖర్ మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. బైక్ గేదెను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. టెక్కలి జాబ్‌మేళా కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి తవిటినాయుడు, తల్లి ఏకాశమ్మ పొందర వృత్తి చేసుకుంటూ బతుకుతున్నారు. కుమారుడు ఈ మధ్యనే బైక్ కొన్నాడు. అతను చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


పాతపట్నం ప్రధాన రోడ్డులో ముర్రాటలతో మహిళలు


ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారు

పాతపట్నం: పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు మహిళలు భారీగా తరలిరావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పలు వీధుల్లో ఆషాఢమాస ఆవేటి వారాల పండుగను నిర్వహించారు. మహిళలు ఘటాలను తీసుకుని ఊరేగింపుగా జూబ్లీహిల్స్ రోడ్డు నుంచి కిమిడి, కళింగ రోడ్డు మీదుగా నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వరకూ మేళతాళాలు, డప్పులు వాయిద్యాలతో వెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేషధారణలు అందరినీ అలరించాయి.

జేసీ నవీన్‌కు ఆత్మీయ సత్కారం


జేసీ నవీన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాయింట్ కలెక్టర్‌గా మల్లారపు నవీన్ జిల్లాపై చెరగని ముద్ర వేశారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు. బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్‌కు మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులు, రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం బృందావన్ ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నవీన్‌ను అధికారులు ఘనంగా సత్కరించారు.

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అతి ముఖ్యమైన మూలపేట పోర్టు భూసేకరణ, రీసర్వే, ధాన్యం సేకరణలో ఆయన మంచి పనితీరు కనబరిచారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఒక గొప్ప ప్రతిభావంతుడైన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. ఏపీ సిఆర్‌డీఏకు ఆయన సేవలు ఎంతగానో దోహద పడతాయని చెప్పారు.

జిల్లా ప్రత్యేకంగా గుర్తుంటుంది: జేసీ నవీన్

బదిలీపై వెళ్తున్న జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ తన విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మూలపేట పోర్టు భూ సేకరణ, తక్కువ వ్యవధిలోనే పోర్టు పనులు ప్రారంభించడం, రీ సర్వే, ఎన్నికల నిర్వహణ, ముఖ్యంగా ధాన్యం సేకరణ, రైతులకు సకాలంలో చెల్లింపులు తనకెంతగానో తృప్తినిచ్చాయని తెలిపారు. తాను ఎక్కడ పని చేసినా శ్రీకాకుళం జిల్లా ఎప్పుడూ ప్రత్యేకమేనని అన్నారు. కోవిడ్ సమయంలో శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసిన రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభూతిని మిగిల్చిందని, మంచి బృందంతో పనిచేసిన అదృష్టం తనకు కలిగిందని అన్నారు. మిగిలిన అధికారులు జేసీ తమకు ఉన్న అనుబంధాన్ని వివరించారు.

ప్రమాదాల బారిన పడవద్దు

- విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి

అరసవల్లి: జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలు, గాలుల కారణంగా ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలాగే ప్రజలు కూడా జాగ్రత్తలు వహించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలు జాగ్రత్తలను వివరించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..

- తుపాన్ల సమయంలో గృహోపకరాలను స్విచ్ ఆఫ్ మోడ్‌లో ఉంచాలి.
- ఇంటిలో స్విచ్‌లు, ప్లగ్‌లను తడి చేతులతో తాకకూడదు.
- ఇంటి సర్వీసు వైర్లు తెగిపోతే, జాయింట్లలో ఎక్కడైనా కట్ అయినా ఎట్టి పరిస్థితుల్లో తాకరాదు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోరాదు.
- ఇంటి ఆవరణలో విద్యుత్ వైర్లు తెగిపోయినా, స్తంభాలు నేలకూలినా, వెంటనే విద్యుత్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. లేదా 1912కు డయల్ చేసి సమాచారమివ్వాలి.
- ఎక్కడైనా విద్యుత్ తీగలు, కండక్టర్ తెగిపడితే వాటిని తీసే ప్రయత్నాలు, తాకే యత్నాలు చేయకుండా వెంటనే కంట్రోల్ రూంకు తెలియజేయాలి.
- పంట పొలాల్లో వర్షం కారణంగా విద్యుత్ మోటార్లు, స్టాటర్లు నీటిలో మునిగే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- ఇళ్లు, భవనాలు నిర్మాణం చేస్తున్న యజమానులు, పనివారు కూడా చాలా అప్రమత్తంగా ఉండాలి. ప్లానింగ్ నిబంధనల ప్రకారం విద్యుత్ వైర్లకు దూరంగా నిర్మాణాలుండేలా చర్యలు చేపట్టాలి.
- ఇళ్లు, షాపింగ్ కాంప్లెక్సుల్లో వినియోగించే విద్యుత్ పరికరాలు నాణ్యతగా ఉండేలా ఐఎస్ఐ మార్కున్న వైర్లు, స్విచ్‌లతో పాటు స్టార్ రేటింగ్ గృహోపకరణాలను మాత్రమే వినియోగించాలి. అలాగే కచ్చితంగా ఎర్త్ పైప్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారులు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలి.